రోడ్డంతా గుంతలమయం

- ఇబ్బందుల్లో నగరవాసులు
- పట్టించుకోని అధికారులు



నిర్మల హృదయ్ స్కూల్ వద్ద గుంతలుగా మారిన రోడ్డు

ఖలీల్‌వాడి: నగరంలోని నాందేవ్‌వాడలోని ప్రధాన కూడలి వద్ద రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రోడ్డు వెంట స్కూల్స్, కాలేజీలు ఉండటంతోపాటు కిసాన్ గంజ్, కూరగయాల మార్కెట్, బస్టాండ్‌తోపాటు నెహ్రూ పార్క్ దగ్గర ఉన్నాయి. దీంతో ఈ రోడ్డు వెంట వాహనాదారులు ఎక్కువ సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. కానీ ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రోడ్డుపై గుంతలు ఏర్పడి, వాటిల్లో వర్షపు నీరు నిలిచింది. ఈక్రమంలో గుంతల రోడ్డుపై రాకపోకలు సాగించడానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే గుంతలు ఎక్కువగా ఉండటంతో పలువురు వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా నగర పాలకవర్గ సభ్యులు, అధికారులు స్పందించి, వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

గుంతలు పూడ్చివేయాలి..



ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులు ఈరోడ్డుపై ప్రయాణించడం ఇబ్బందిగా మారింది. ఈ రోడ్డుకు వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మరమ్మతులు చేయించాలి.

–శంకర్, నిజామాబాద్ వాసి

క్లుప్తంగా

మంచిప్పలో ఏసీపీ పర్యటన



మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని మంచిప్ప చెరువులతోపాటు అటవీ అందాలను ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ వెంకట నారాయణ సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా చెరువుల నీటి సామర్థ్యం, ఆయకట్టుతోపాటు దట్టమైన అడవుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎస్సై రాము, సర్పంచులు ఇందూరి సిద్ధార్థ, పరుశరాం, ఉపసర్పంచి జగదీష్, వీడీసీ అధ్యక్షుడు నవీన్, తదితరులు ఉన్నారు.

విద్యార్థి కదనభేరిని విజయవంతం చేయండి



తెయూ(డిచ్‌పల్లి): ఏబీవీపీ ఆధ్వర్యంలో నేడు హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ విద్యార్థి కదన భేరి భారీ బహిరంగ సభను విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని తెలంగాణ యూనివర్సిటీ ఏబీవీపీ నాయకులు కోరారు. తెయూలో వారు విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలను వివరించారు. ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ బచ్చుబోయిన శివ, నాయకులు నవీన్, సాయి, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

తెగిన రోడ్డుతో ఇబ్బందులు




సిరికొండ: మండలంలోని పాకాల గ్రామ పంచాయతీ పరిధిలో గల గంగారం తండాకు వెళ్లే దారిలో కల్వర్టు వద్ద రోడ్డు తెగిపోవడంతో తండావాసులు ఇబ్బందులు పడుతున్నారు. గత గురువారం కురిసిన భారీ వర్షం, వరద ప్రవాహానికి కల్వర్టు వద్ద రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో తాండాకు వెళ్లడానికి మార్గం లేకుండా పోయింది. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని తండావాసులు కోరుతున్నారు.

రైతులకు తక్షణమే న్యాయం చేయాలి



ధర్పల్లి: వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి డిమాండ్ చేశారు. ధర్పల్లి మండలంలోని రామడుగు గ్రామంలో ఆయన సోమవారం పర్యటించారు. ముందుగా రామడుగు ప్రాజెక్టును పరిశీలించి అనంతరం గ్రామంలో వర్షాలకు ఇసుక మేటలు వేసిన పొలాలను, ధ్వంసమైన రోడ్లను పరిశీలించారు. వరద బాధితులను పరామర్శించి, నిత్యవసర వస్తువులను అందజేశారు. ఈసందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఎక్కడ ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా భవనాలు నిర్మించిన దాఖలాలు లేవని ఆరోపించారు. రైతులకు పంటనష్ట పరిహారం అందజేయాలని, లేనిపక్షంలో ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు బాలరాజ్, భాస్కర్, మహేందర్, నర్సయ్య, ఆనంద్, గంగారెడ్డి పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి



ఇందల్వాయి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులతో పాటు, ఇళ్లు కూలిపోయిన బాధితులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాటిపల్లి నగేష్ రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని గండి తండా, రంజిత్‌నాయక్ తండా, లోలం గ్రామాల్లో ఆయన సోమవారం పర్యటించారు. కాంగ్రెస్ తరపున బాధితులకు త్వరలో సహాయం అందిస్తామని తెలిపారు. నాయకులు నవీన్ గౌడ్, వెంకట్ రెడ్డి, గంగాధర్, గంగారెడ్డి, ఆశిష్, భైరయ్య తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



రోటరీనగర్‌లో సీసీ రోడ్డుకు భూమిపూజ నిర్వహిస్తున్న మేయర్ నీతూకిరణ్, నాయకులు

నిజామాబాద్‌నాగారం: నగరంలో ఉన్న సమస్యలు పరిష్కరించడానికి తనవంతుగా కృషి చేస్తానని మేయర్ నీతూకిరణ్ అన్నారు. నగరంలోని 7, 8వ డివిజన్లలో సోమవారం సీసీ రోడ్ల నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా ఆదేశాల మేరకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించినట్లు తెలిపారు. కార్పొరేటర్లు విక్రమ్ గౌడ్, సుక్క మధు, బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షులు సిర్ప రాజు, నాయకులు నరేందర్ గౌడ్, మురళి, ప్రవీణ్, సంతోష్, గాండ్ల లింగం, అనిల్ రావ్, జగత్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.

నిజామాబాద్‌నాగారం: నగరంలోని వినాయక నగర్ వైష్ణవి రెసిడెన్సి పరిసర ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని మేయర్ నీతూకిరణ్ పేర్కొన్నారు. వినాయక్ నగర్‌లో రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ, తాగునీటి సమస్యల గురించి సోమవారం ఆమె తనిఖీ చేశారు. విద్యుత్ అధికారులు, మున్సిపల్ అధికారులతో కలిసి వైష్ణవిరెసిడెన్సి, కాలనీవాసులతో మాట్లాడి సమస్యల గురించి తెలుసుకున్నారు. కాలనీవాసులు నిర్మల హదయ, ప్రధాన కార్యదర్శి కృష్ణారావు, కోశాధికారి సురేష్, సలహాదారులు రామ్మోహన్‌రావు, కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాల పంపిణీ



సికింద్రాపూర్‌లో గేదెలకు టీకాలు వేస్తున్న ఎంపీపీ విమల

జక్రాన్‌పల్లి: మండలంలోని సికింద్రాపూర్ గ్రామంలో సోమవారం ఆవులు, గేదెలకు నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ కుంచాల విమల రాజు ప్రారంభించారు. మండల పశువైద్య శాఖ ఆధ్వర్యంలో గేదెలకు డీవార్మింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ తలారి గంగామణి, పశువైద్యాధికారిణి శిరీషా, గోపాల మిత్రలు పాల్గొన్నారు. ఈ నెల 2న గన్యతండా, 3న పుప్పాలపల్లి, 4న కేశ్‌పల్లి, 5న చింతలూర్, 7న కలిగోట్, 8న కొలిప్యాక్,9న మనోహరాబాద్, 10న తొర్లికొండ, 11న బ్రాహ్మణ్‌పల్లి. 12న మునిపల్లి, 14న లక్ష్మాపూర్, 16న నల్లగుట్ట తండా, 17న నారాయణ్‌పేట్, 18న అర్గుల్, 21, 22న పడకల్, 23న చాంద్‌మియా బాగ్, 24న వివేక్‌నగర్ తండాలలో డీవార్మింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మండల పశువైద్యాధికారిణి శిరీషా తెలిపారు.

నేటి నుంచి సిరికొండ మండలంలో..

సిరికొండ: పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు నట్టల నివారణ మందులను మండలంలో మంగళవారం నుంచి వేయనున్నట్లు మండల పశుసంవర్ధక శాఖ అధికారి బాబురావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు నెలల పశువుల నుంచి పెద్ద గేదెలకు, ఆవులకు నట్టల నివారణ మాత్రలను వేస్తామని తెలిపారు.

రామచంద్రయ్యకు ఘన నివాళి




ధర్పల్లి: ఆదివాసీల పక్షాన పోరాటిన దివంగత నాయకుడు దేశెట్టి రామచంద్రయ్యకు ఏఐకేఎంఎస్ నాయకులు ఘన నివాళి అర్పించారు. మండల కేంద్రంలో సోమవారం అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో రామచంద్రయ్య సంతాప సభ నిర్వహించారు. ఈసందర్భంగా సంఘ సభ్యులు ఆయన చిత్రపటం వద్ద మౌనం పాటించి, ఆయన పోరాటాలను కొనియాడారు. జిల్లా అధ్యక్షుడు గంగారెడ్డి, నాయకులు ఉషన్న, పోతిరెడ్డి, రాజేశ్వర్, రాజన్న, హరికష్ణ గంగాధర్ పాల్గొన్నారు.

మణిపూర్‌ను రక్షించండి



నిజామాబాద్‌అర్బన్: కార్పొరేట్ శక్తుల నుంచి మణిపూర్‌ను రక్షించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, నగర ఉపాధ్యక్షురాలు దేవిక అన్నారు. నగరంలోని కోటగల్లిలో మణిపూర్ ఘటనను నిరసిస్తూ సోమవారం వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రపతి, కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, మణిపూర్‌లో శాంతిభద్రతలు కాపాడాలని కోరారు. నాయకులు మనోజ్, నిఖిల్, వంశీ, శ్రీజ, తనుజ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నిజామాబాద్‌నాగారం: నగరంలో సోమవారం దుబ్బ మున్నూరుకాపు సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా కొడపు శరత్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ దారం సాయిలు, సెక్రెటరీ పంచరెడ్డి సుమన్, జాయింట్ సెక్రెటరీ గంటరాజు, కోశాధికారి గంట భీమన్న, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఆదం బాలరాజు, మెంగర్తి శివ, తొందూరు ప్రదీప్ , తుల రాకేష్, దారం సాయికుమార్, ఆకుల గంగా కిషన్, అడ్వైజర్లుగా ఏక్కొండ ప్రభాకర్, దారం సాయిలు, తొందూరు అశోక్‌లను ఎన్నుకున్నారు. సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఏఐసీసీ సెక్రెటరీని కలిసిన సంజయ్



ఖలీల్‌వాడి: ఏఐసీసీ సెక్రటరీ పీసీ విష్ణునాథ్‌తో మాజీమేయర్, కాంగ్రెస్ సీనియర్ నేత ధర్మపురి సంజయ్ సోమవారం భేటీ అయ్యారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనే లక్ష్యంపై దృష్టిసారించి పని చేయాలని పీసీ విష్ణునాథ్ మాజీమేయర్‌కు సూచించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేస్తామని మాజీ మేయర్ వివరించారు.

పుస్తక ప్రచురణ సహకారానికి ఎంపిక



నిజామాబాద్ సిటీ: జిల్లాకు చెందిన ప్రముఖ కవి డాక్టర్ కాసర్ల నరేష్‌రావు రచించిన సరికొత్త పుస్తకం రుబాయిరాగాలు తెలుగు విశ్వవిద్యాలయం వారి ప్రచురణ సహకారానికి ఎంపికైనట్లు రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కాసర్లకు పుస్తకం ఎంపికై నట్లు లేఖ పంపారు. 2023–24 సంవత్సరానికి ఎంపికైన ఈ రుబాయిరాగాలు పుస్తక ప్రచురణకు రూ. 10వేలు విశ్వవిద్యాలయం అందించనుందన్నారు.

దంత వైద్య శిబిరం



నిజామాబాద్ సిటీ: మాణిక్‌భవన్ పాఠశాలలో సోమవారం రోటరీ క్లబ్ జేమ్స్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ శీను నాయక్ డెంటల్ ఆస్పత్రి సహకారంతో విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షుడు భూలోకం విజయ్‌కాంత్ రావు తెలిపారు. వైద్యురాలు మౌనిక విద్యార్థులకు దంత సమస్యలపై అవగాహన కల్పించారు. క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్‌కు భూమిపూజ



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం పాంగ్రా వెస్ట్ బ్యాంక్ కాలనీలో సోమవారం ఓపెన్ జిమ్ ఏర్పాటుకు ధర్పల్లి జెడ్పీటీసీ, జిల్లా ఒలంపిక్ కమిటీ ఉపాధ్యక్షుడు బాజిరెడ్డి జగన్ భూమిపూజ చేశారు.బీఆర్ఎస్ పార్టీ నాయకులు నాగళ్ళ శ్రీకాంత్ చౌదరి, నరసింహచారి, సురేష్, రమేష్, ముత్యాల శిల్ప, కాలనీవాసులు పాల్గొన్నారు.

డాక్టర్ తిరుపతిరావుకు వైద్యరత్న అవార్డు



నిజామాబాద్ సిటీ: అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మదర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైద్యుడు జలగం తిరుపతిరావుకు వైద్యరత్న అవార్డు అందజేశారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, మదర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ మోహన్‌సింగ్ సంస్మరణ సభ



తెయూ(డిచ్‌పల్లి): ఉస్మానియా యూనివర్సిటీ హిందీ విభాగం ప్రొఫెసర్ మోహన్‌సింగ్ ఇటీవల మృతి చెందారు. సోమవారం తెయూ హిందీ విభాగం ఆధ్వర్యంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ మినీ సెమినార్ హాల్‌లో మోహన్‌సింగ్ సంస్మరణ సభ నిర్వహించారు. తెలంగాణ యూనివర్సిటీ అధ్యాపకులు ఆయన సేవలను కొనియాడారు. తెయూ అధ్యాపకులు మూసాఖురేషీ, లక్ష్మణచక్రవర్తి, పార్వతి, తాహెర్, అశోక్, వాసు, అనిల్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలి



మాట్లాడుతున్న ఆర్డీవో రాజేంద్రకుమార్

డిచ్‌పల్లి: త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని ఆర్డీవో రాజేంద్రకుమార్ సూచించారు. మండల కేంద్రంలోని మానవతసదన్‌లో సోమవారం రూరల్ నియోజకవర్గంలోని తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌లు, సీఐలు, ఎస్సైలతో ఆర్డీవో రాజేంద్రకుమార్, ఏసీపీ కిరణ్‌కుమార్‌లు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ముందస్తుగా గుర్తించి వివరాలు పంపించాలని సూచించారు. దూరప్రాంతాల పోలింగ్ కేంద్రాలకు వెళ్లే గ్రామాల ఓటర్ల సౌకర్యార్థం వారికి దగ్గరలోనే ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలను మార్చుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించినట్లు ఆర్డీవో తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్నందున పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ సూచించారు.

ఆర్టీసీ సిబ్బందికి పురస్కారాలు అందజేత



ఆర్టీసీ సిబ్బందికి పురస్కారాలు అందజేస్తున్న ఆర్ఎం జానీరెడ్డి

ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఆర్టీసీ రీజినల్ పరిధిలోని డ్రైవర్లు, కండక్టర్లుకు త్రైమాసిక పురస్కార అవార్డులను ఆర్ఎం జానీరెడ్డి సోమవారం అందజేశారు. ఆర్టీసీలో డ్రైవర్లు, కండక్టర్లు చేసిన పనులకు గుర్తింపుగా ఈ అవార్డులు అందజేస్తున్నట్లు ఆర్ఎం తెలిపారు. నిజామాబాద్ రీజినల్ పరిధిలో 13మంది డ్రైవర్లు, ఏడుగురు కండక్టర్లు, ముగ్గురు మెకానిక్‌లకు అవార్డులు అందజేశారు. డిప్యూటీ ఆర్ఎం(ఆపరేషన్) సరస్వతి, డిపో మేనేజర్లు ఆనంద్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అమరవీరుల స్థూపంపై పట్టింపేది!



అమరవీరుల స్థూపంపై ముగిగిన పూలు

నిజామాబాద్ సిటీ: నగరంలోని వినాయక్‌నగర్ తెలంగాణ అమరవీరుల పార్కులో అమరవీరుల స్థూపాన్ని పట్టించుకునేవారు కరువయ్యారు. ఈయేడాది తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు జూన్ 2 నుంచి 22 వరకు నిర్వహించారు. చివరిరోజు 22న అమరులకు నివాళులు అర్పించేందుకు స్థూపాన్ని ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. ఈ పూలు రెండురోజుల తర్వాత తొలగించాల్సి ఉండగా ఇప్పటివరకు తొలగించలేదు. స్థూపంపై పూలు మురిగిపోయి కిందకు పడుతూ దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో పార్కులోని సందర్శకులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి స్థూపంపై పూలను తొలగించాలని వాకర్స్, స్థానికులు కోరుతున్నారు.

కమిషనర్‌కు సన్మానం



నిజామాబాద్‌నాగారం: నగరపాలక సంస్థ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్‌గా విచ్చేసిన మంద మకరంద్‌ను సోమవారం నిజామాబాద్ జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం చైర్మన్ మాయావార్ రాజేశ్వర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని టౌన్–3 పరిధిలో విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా మంగళవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ వీరేశంఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని మహాలక్ష్మీనగర్, అమ్మవెంచర్, బసవగార్డెన్ వెనుక భాగంలో 11కేవీ విద్యుత్ మరమ్మతుల కారణంగా కరెంట్ కోత ఉంటుందన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	61,100	వెండి (కిలో)	77,600
22 క్యారెట్స్	56,332	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు	డ్రెస్డ్	180
	(కిలోకు)	లైవ్	160
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	170	200	గాజరుగడ్డ	30	50
బెండకాయ	50	70	పచ్చిమిర్చి	70	100
బీరకాయ	60	80	దోసకాయ	20	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	18	30
బీర్నీసుకాయ	80	100	గోబిగడ్డ	20	40
కాకరకాయ	50	70	గోబిపువ్వు	40	60
వంకాయ	30	50	బీట్‌రూట్	30	50
పాలకూర	40	60	కరివేపాకు	40	60
మెంతికూర	40	60	చామగడ్డ	40	60
కొత్తిమీర	20	40	గోరుచిక్కుడు	30	50
పుదీనా	70	100	చిక్కుడుకాయ	50	70
క్యాప్సికం	60	80			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1: బ్రో (తెలుగు) - 10.40, 1.30, 4.30 7.20, 10.20
- స్క్రీన్-2: రాఖీ ఔర్ రానీ కీ ప్రేమ్ కహానీ (హిందీ) -1.10, 4.20, 10.40; బేబి-2023 (తెలుగు) -7.30
- స్క్రీన్-3: బేబి-2023(తెలుగు)-10.20,1.20, 4.30, 10.30; రాఖీ ఔర్ రానీ కీ ప్రేమ్ కహానీ(హిందీ)-7.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1: బ్రో(తెలుగు)-11.00,1.55,4.50 7.45,10.40
- స్క్రీన్-2: బ్రో(తెలుగు)-10.00 12.55 3.50 6.45 9.40
- స్క్రీన్-3: రాఖీ ఔర్ రానీ కీ ప్రేమ్ కహానీ (హిందీ)-9.25, 1.00,7.15,10.50; బార్బీ(ఇంగ్లీష్)-4.35
- స్క్రీన్-4: బేబి(తెలుగు)-11.10 6.30; ఓపెన్ హైమర్(ఇంగ్లీష్)-2.40 10.00

- దేవి: బ్రో (తెలుగు)
- నటరాజ్: స్లిమ్‌డాగ్ హస్బెండ్ (తెలుగు)
- లలితామహల్: సామజవరగమన(తెలుగు)
- విజయ్: బేబి

రేపు పీవీ విగ్రహ ఆవిష్కరణ



సమావేశంలో మాట్లాడుతున్న బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు

నిజామాబాద్ సిటీ: నగరశివారు బోర్గాం(పీ) చౌరస్తాలో ఏర్పాటు చేసిన మాజీ ప్రధాని, దివంగత పీవీ నరసింహారావు విగ్రహ ఆవిష్కరణ రేపు(బుధవారం) నిర్వహించనున్నట్లు తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ దేశ్‌ముఖ్ తెలిపారు. మహాలక్ష్మీనగర్‌లోని సంఘం కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించి, మాట్లాడారు. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, గణేశ్‌గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, మంత్రి ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, పీవీ నరసింహారావు కుటుంబ సభ్యులు, మేయర్ నీతూకిరణ్‌లు హాజరుకానున్నట్లు తెలిపారు. జిల్లాలోని బ్రాహ్మణ సమాజ సభ్యులందరు హాజరుకావాలని కోరారు.